క్లుప్తంగా

పెద నక్కలపాలెంలో నేత్రదానం


రత్తమ్మ

చినగంజాం: నేత్రదానంతో మరొకరికి కంటి చూపును ప్రసాదించవచ్చని పలువురు పేర్కొన్నారు. మండలంలోని పెద నక్కలపాలేనికి చెందిన దాత కామేపల్లి రత్తమ్మ (65) అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, మారుతీరావు, లక్ష్మి, అనుమతితో గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు కార్నియాలను సేకరించినారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామమోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్ష, కోశాధికారి కమలేశ్వరావు, చుండి సాంబశివరావు, సభ్యులు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన పురోహితులు స్వామివారికి అష్టదళ పాదపద్మారాధన సేవ చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయింత్రం స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది.

విద్యార్థికి బొమ్మిడాల ట్రస్ట్ ఆర్థిక సాయం


రవితేజకు చెక్కును అందజేస్తున్న భానుమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: గేట్‌లో జాతీయస్థాయిలో ర్యాంకు సాధించిన విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. గేట్‌లో రెండో ర్యాంకు ఆధారంగా ముంబై ఐఐటీలో ఎంటెక్ సీటు పొందిన అద్దంకి పట్టణానికి చెందిన ఘంటసాల రవితేజకు బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి సెమిస్టర్‌కు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారు. సోమవారం కాకాని రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో విద్యార్థి రవితేజకు చెక్కు అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేసిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్టి శ్రీరాములు, గాంధీ క్లబ్స్ చైర్మన్ బంగారుబాబు, కొలిశెట్టి సతీష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం, శ్రవణ నక్షత్రం, తదియ తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం . మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలి

● ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: పట్టణంలోని 8వ వార్డులో రోడ్ల నిర్మాణాలను చేపట్టి డ్రైనేజీ సౌకర్యాన్ని కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వార్డులోని మసీద్-ఎ-అన్సర్ జెండా చెట్టును సందర్శించారు. వార్డులోని ప్రజలు ఆయనను కలిసి వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, అందుకు చర్యలు తీసుకోవాలని కోరగా వెంటనే స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ ఇలియాజ్, సయ్యద్ బాబు, షేక్ జమీర్, షేక్ ఖలీమ్, సయ్యద్ రియాజ్, షేక్ మస్తానమ్మ, సజ్జా వెంకటేశ్వరరావు, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలానే క్యాంపు కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటియూసీ తరుపు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.


8వ వార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

వ్యాధుల కాలం.. ఆరోగ్యం భద్రం

● వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి అవకాశం
● జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం
● డెంగీ, మలేరియా నివారణకు వైద్యశాఖ చర్యలు


పంగులూరులో శానిటేషన్ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

జే.పంగులూరు: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. వర్షాలకు వీధులు, కాలువల్లో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా ఉద్ధృతి పెరిగే ప్రమాదం ఉంది. జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చని చెప్తున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల తాగునీరు కలుషితమవుతున్నాయి. మరికొన్ని చోట్ల వర్షపు నీరు నిలిచి దోమలు పెరిగి పలురకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యాధుల కట్టడికి వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రజలు ఇళ్లల్లో కొంది పాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి.

టైఫాయిడ్..

కలుషిత ఆహార, నీరు ద్వారా సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా టైఫాయిడ్ వ్యాపిస్తుంది. 103 నుంచి 104 డిగ్రీల వరకు జ్వర తీవ్రత ఉండడం, వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, తల, కడుపునొప్పి, ఒళ్ల నొప్పులు, నీరసం దీని లక్షణాలు

డెంగీ..

కేవలం దోమ ద్వారా మాత్రమే వచ్చే వ్యాధి డెంగీ. స్వచ్ఛమైన నీటిలో తిరుగుతూ పగటిపూట మాత్రమే కుట్టే దోమ ఇది. ఈ దోమ కుట్టిన 2 నుంచి 7 రోజుల్లో వణుకుతూ జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒంటినొప్పులతో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, ఆకలి మందగించడం, ఛాతీపై ఎర్రటి మచ్చలు రావడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లేట్స్ కౌంట్ తగ్గిపోవడం, లో బీపీ, చర్మంపై దద్దుర్లు, పొట్టలో వికారంగా ఉంటుంది.


నార్నెవారిపాలెంలో రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు నీరు (ఫైల్)

మలేరియా..

ప్లాస్మోడియా జాతి సూక్ష్మక్రిముల మూలంగా ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ కుట్టిన వ్యక్తి రక్తంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములు కాలేయాన్ని చేరుకుని, కాలేయ కణాల్లోకి చొచ్చుకెళతాయి. ఇవి సంతానాన్ని వృద్ధి చేసి మలేరియా వ్యాధిని కలిగిస్తాయి. వస్తూ పోయే జ్వరం, కడుపులో అసౌకర్యం, చలితో వణుకు, కొంత సేపటికే చెమటలు ఇవే మలేరియా లక్షణాలు.

కామెర్లు..

కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధి కామెర్లు. ఇది హెపటైటిస్-బీ, సీ వంటి ఇన్ఫెక్షన్‌తో కామెర్లు వచ్చే అవకాశం ఉంది. కళ్లు, చర్మ పసుపు పచ్చగా మారడం, రక్తంలో బెలురుబిన్ స్థాయి పెరగడం, ఆకలి మందగించడం, జ్వరం, గొంతు నొప్పి, మూత్రం పచ్చగా రావడం, కడుపు నొప్పి లక్షణాలు ఉంటాయి.

డయేరియా..

బ్యాక్టీరియా, వైరల్, పరాన్న జీవుల ఇన్ఫెక్షన్ మూలంగా నీళ్ల విరేచనాలు వస్తాయి. రోజుకు మూడు అంత కన్న ఎక్కువగా నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించవచ్చు. ఈవ్యాధితో ఒంట్లో ఉండాల్సిన నీటి శాతం తగ్గిపోయి ముఖ్యమైన లవణాలు (బైకార్బొనేట్, పొటాషియం) బయటకు పోవడం ద్వారా డీహైడ్రేషన్‌కు దారి తీస్తుంది.

నివారణ చర్యలు..

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది కృషి చేయాల్సి ఉంది. వారినికి ఒక్క రోజు డ్రైడే పాటించేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలి. సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోవాలి. జ్వరం వచ్చిన వారితో పాటు అనుమానితుల వద్ద కూడా రక్త నమూనాలు సేకరించాలి. అవసరం అయితే ఉచితంగా మందులు పంపిణీ చేయాలి. సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తిచెందే టైఫాయిడ్‌తో పాటు డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణంతకమని వైద్యులు తెలియజేస్తున్నారు. బ్యాక్టీరియా ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల కంటే జ్వరం తగ్గకపోతే స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులను సంప్రదించాలి. అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, యాంటిబయాటిక్స్, సెలైన్ బాటిళ్లు, రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు నీటిని కాచి తాగాలి. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డాక్టర్ శివచెన్నయ్య, వైద్యాధికారి పీహెచ్‌సీ పంగులూరు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలి.
- మల, మూత్ర విసర్జన అనంతరం సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.
- పనికిరాని, సీసాలు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, వాటర్ బాటిళ్లు, కూలర్లలో నీరు నిల్వ ఉంచరాదు.
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి.
- చిన్నపిల్లలకు ఒంటిని పూర్తి కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


వేటపాలెంలో నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సంఘం సభ్యులు


చినగంజాంలో పుస్తకాలు పంపిణీ చేసిన దాతలు

వేటపాలెం: సర్వోదయకాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభంలో కొత్తగా వసతి గృహంలో చేరిన విద్యార్థులతో పాటు పాత వారికి పుస్తకాలు అందించారన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మస్తాన్‌రెడ్డి, కార్యదర్శి చుండూరి నాగాంజనేయులు, శేఖర్, ప్రత్తి శరత్‌బాబు, హెచ్‌ఎం శివపార్వతి, రవికుమార్, తదితరలు పాల్గొన్నారు.

చినగంజాంలో..

వివేకానంద సేవా సమితి, ఉప్పుగుండూరు వారి ఆధ్వర్యంలో మండలంలోని పెదగంజాం పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా దాత శివాజీ మాట్లాడుతూ విద్యార్థులకు గత 10 ఏళ్లుగా విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని చెప్పారు. కావున బాలబాలికలు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టీవీఎస్ శైలజ కుమారి, టీచర్లు బి సుకన్య, సూపర్‌వైజర్ అయిన మాచవరపు చిరంజీవి, ఏఎన్‌ఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల


సట్టు పోలేరమ్మ

బల్లికురవ: మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న సట్టుపోలేరమ్మ మూడో వార్షిక తిరునాళ్ల సోమవారం వైభంగా నిర్వహించారు. ఆలయంలోని అమ్మవారికి వివిధ ఉపాలయాల్లోని దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు అలంకరణ చేపట్టారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని పొంగళ్లు పెట్టి నివేదించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేపట్టారు. భారీ ఎలక్ట్రిక్ ప్రభ, అనేక మొక్కుబడి ప్రభలు అమ్మవారి సన్నిధానానికి చేరాయి. రాత్రికి ఎలక్ట్రిక్‌ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కోలాహలంగా కొలుపులు


కొలుపుల గ్రామోత్సవంలో భక్తులు


బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ కొలుపులు రెండోరోజు సోమవారం కోలాహలంగా జరిగాయి. ఆలయంలోని అమ్మవారిని ఆమె సోదరుడు పోతురాజును ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు డప్పువాయిద్యాలు, పాట కచ్చేరిలతో బొల్లావులతో గ్రామోత్సవం నిర్వహించారు. వేడుకల్లో గ్రామస్తులంతా పాల్గొనటంతో పండుగ వాతావరణం నెలకొంది. మంగళవారం రాత్రితో పోలేరమ్మ కొలుపులు ముగియనున్నాయి.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రారంభం


పరిష్కార వేదికలో పాల్గొన్న తహశీల్దార్ సంధ్యశ్రీ

మార్టూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు మండల తహశీల్దార్ కే సంధ్యశ్రీ తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభోత్సవం సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు తమకు సంబంధించిన రెవెన్యూ పరమైన సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ లో అర్జీల రూపంలో అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాల్సిందిగా ఆమె సూచించారు. కార్యక్రమాలు ఎంపీడీవో జి నితిన్, ఎంఈఓఎం వస్రం నాయక్, డిటీ శివ శ్రీను ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి


ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: క్రరీస్ పాయింట్ యజమాని కంచర్ల సంతోష్‌ను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం క్యాటరింగ్ యూనియన్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావుకు వినతిపత్రం అందించారు. అలానే కంచర్ల సంతోష్ మృతికి సంతాపంగా పట్టణంలో సాయంత్రం 4గంటల నుంచి అన్ని వ్యాపార సంస్థలు, ఎంజీసీ మార్కెట్‌ను మూసివేశారు. అలానే ఆయన అంతిమ యాత్రలో పాల్గొని సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో తులాబందు సురేష్, చిన్ని లీలాధరరావు, అచ్యుత శ్రీనివాసరావు, వేముల చంద్రశేఖరరావు, శీరం వేణుగోపాల్, పొత్తూరి సుబ్బయ్య, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలు చేపట్టాలి


పంగులూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో

జే.పంగులూరు: ప్రతి పంచాయతీలో స్వచ్ఛసంకల్ప కార్యక్రమాలు చేపట్టాలని పంగులూరు మండల ఎంపీడీవో అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా, పారిశుద్ధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు డ్రింకింగ్ వాటర్ సోర్స్‌ను పరిశీలించి రిపోర్టును సిద్ధం చేయాలని ఆదేశించారు.

అద్దంకి రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను ఎంపీడీవో సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డయేరియా, పరిశుద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అద్దంకి ఎంపీడీవో

డయేరియా ప్రబలకుండా చర్యలు


అధికారులకు సూచనలందిస్తున్న ఎంపీడీవో శోభారాణి

చీరాల టౌన్: ఎక్కడా కూడా డయేరియా రాకూడదు.. కార్యదర్శులు నిబద్ధతతో పనిచేస్తే సత్ఫలితాలు సాధిస్తారని ఎంపీడీవో శోభారాణి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, డ్రైనేజీ, ఇంజినీరింగ్, మెడికల్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడతుతూ గ్రామ పంచాయతీల్లో మంచినీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. డయేరియా, ఇతర వ్యాదులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోజువారీ గ్రామాలను సందర్శిస్తూ చెత్తకుప్పలను తొలగించి పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సాంద్రత వివరాల రిపోర్టులు అందించాలన్నారు. స్వచ్ఛ సంకల్పం లక్ష్యాలను విధిగా అమలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఈలు, సిబ్బంది ఉన్నారు.

వైద్య శిబిరంలో 550 మందికి పరీక్షలు


వైద్య శిబిరంలో హాజరైన ప్రజలు


మార్టూరు వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య బృందం

మార్టూరు: మండల కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మార్టూరు రాయల్ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 550 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ విద్యావేత్త గణేశుడి రత్తయ్య చౌదరి అన్నపూర్ణమ్మ దంపతుల స్మారకార్థం, మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మార్టూరుకు చెందిన ఐఆర్‌ఎస్ అధికారి వీరగంధం లక్ష్మీ సుజిత ప్రారంభించారు. శిబిరంలో గుండె దంత, కంటి, మహిళలకు సంబంధించిన వ్యాధుల పరీక్షల నిర్వహించారు. అవసరమైన వారికి ఈసీజీ, ఎకో టెస్టులు నిర్వహించారు. కంటి శాస్త్ర చికిత్సల కోసం 55 మంది రోగులను ఎంపిక చేశారు. మల్లారెడ్డి క్యాన్సర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు చిగురుపాటి రామారావు, ముద్దన సతీష్ బొల్లినేని శిరీష, సుప్రజ తదితరులు పాల్గొన్నారు. మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, జేవీ మోహన్‌రావు, వీరగంధం శ్రీనివాసరావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

పంటసాగుదారు హక్కు పత్రంపై అవగాహన


వేటపాలెంలో మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణకాంత్


సీసీఆర్‌సీ కార్డుల పై అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల: మండల కేంద్రమైన కొరిశపాడు కార్యాలయంలో సీసీఆర్‌సీ (పంటసాగుదారు హక్కు పత్రం) పై రైతులకు, కౌలు దారులకు అవగాహన కల్పించాలని ఏవో శ్రీనివాసరావు సూచించారు. మండల కార్యాలయంలో సోమవారం వీఆర్‌వోలకు, వీఏఏలకు, వీహెచ్‌ఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ ఈ పత్రం భూ యజమానికి, సాగు దారుడికి మధ్య ఒప్పంద పత్రం అన్నారు. ఈ పత్రం కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని, ఈపత్రంతో బ్యాంకు ద్వారా సాగుదారుడు రుణం పొందే అర్హత ఉంటుందన్నారు. అలాగే రైతు భరోసా పొందేందుకు వీలు కలుగుతుందని, అంతే కాకుండా ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే ప్రతి పథకం పొందేందుకు వీలు కలుగుతుందని ఏవో తెలిపారు. రైతులకు సమాచారాన్ని అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, వీఆర్‌వోలు, వ్యవసాయశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేటపాలెంలో..

వేటపాలెం: కౌలుకు భూమిని సాగు చేసుకొనే ప్రతి రైతుకు ధ్రువీకరణ పత్రాలు అందించాలని వీఆర్‌ఓలను తహశీల్దార్ పీ. కృష్ణకాంత్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమావేశం హాల్లో కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ కోసం వీఆర్‌ఓ, ఏఈవో, వీఏఏ, వీహెచ్‌ఏలకు సోమవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ధ్రువీకరణ పంత్రాలు పొందిన కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే లాభాలను వివరించారు. పండించిన పంటలను విక్రయించు కోవడానికి, పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందుకోవడానికి పత్రాలు ఉపయోగపతాయని తెలిపారు. కౌలు రైతులు సాగు ధ్రువీకరణ పత్రం తీసుకోవడానికి భూమి యజమాని పొలం పట్టా దారు పాస్ బుక్‌జిరాక్స్, ఆధార్, పాస్ పోర్టు పోటోలు తీసుకొని గ్రామ సచివాలయంలో వీఆర్వోలకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్, డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్న, వీర్‌ఆర్‌ఓ, ఏఈఓ, వీఏఏలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు కల్పించాలి


ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అద్దంకి రూరల్: అద్దంకి మండలంలోని గ్రామాల్లో గత పదిరోజులనుంచి ఉపాధిహామీ పనులు నిలిపివేశారని.. పనులు ప్రారంభించి వ్యవసాయకార్మికులకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అద్దంకి ఎంపీడీవో సత్యనారాయణకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలు రాజకీయ పరిస్థితుల కారణంగా మండలంలోని మణికేశ్వరం, కొంగపాడు, చక్రాయపాలెం, వేలమూరిపాడు తదితర గ్రామాల్లో ఉపాధి పనులు ఆగిపోయాయని తెలిపారు. దీనివల్ల ఆయా గ్రామాల్లోని వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. పనులకు వచ్చే కార్మికులకు పేస్లిప్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించొద్దు

యద్దనపూడి: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల సహకారంతో పారిశుద్ధ్య నిర్వహణ పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. వర్షాలకు నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, రక్షిత మంచినీటి పైపులు లీకులు లేకుండా తక్షణ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ బ్రహ్మయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.